పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వరికూటి

కొండపి(సింగరాయకొండ): అర్హత కలిగిన ప్రతి పేద వానికి కులాలు, పార్టీలకు అతీతంగా అవినీతి రహితంగా ప్రభుత్వ పథకాల లబ్ధి అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. కొండపి మండలం పెట్లూరు పంచాయతీలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వరికూటి పాల్గొన్నారు. వరికూటి మాట్లాడుతూ తాను నియోజకవర్గంలో 80 వేల గడపలు తిరిగితే సాంకేతిక కారణాల వలన చాలా తక్కువ మందికి మాత్రమే అర్హత ఉండి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నియమించిన జన్మభూమి కమిటీలతో అర్హత ఉన్నా, లేకపోయినా తమకు ఇష్టం ఉన్నవారికి మాత్రమే అందించారని, ఇప్పుడేమో తాను అధికారంలోకి వస్తే ప్రతి పేదవానిని కోటీశ్వరుని చేస్తానని మాయ మాటలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం పేదవాని భవిష్యత్‌కు ఢోకా లేదని భరోసా ఇచ్చారు. కొండపి నియోజకవర్గంలో టీడీపీ పని అయిపోయిందని వరికూటి జోస్యం చెప్పారు. ఇందుకు టంగుటూరులో నిర్వహించిన శతజయంతి ఉత్సవాలే ఉదాహరణ అని చెప్పారు. టీడీపీ వారు చాలా రోజుల నుంచి కార్యక్రమం జయప్రదం చేయాలని సన్నాహాలు చేశారని కానీ కార్యక్రమం అట్టర్‌ఫ్లాప్ అయిందని ఇది తాను చెప్పిన మాట కాదని టీడీపీ శ్రేణులే చర్చించుకుంటున్నాయన్నారు. కాని నేను ఒక్క రోజు ముందే కార్యక్రమం చేద్దామని నిర్ణయించానని టంగుటూరు నుంచి భారీ బైక్‌ర్యాలీతో పాటు కొండపి మండల కేంద్రంలో భారీ పాదయాత్ర నిర్వహించానని దీనిని బట్టి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి ఉన్న బలం అర్థమవుతోందన్నారు.

80 వేల గడపలు పూర్తి

పెట్లూరులో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 80 వేల గడపలు పూర్తయిన సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. తరువాత ప్రధాన సెంటర్లో డీజే వాహనం ఎక్కి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు ఏవిధంగా మేలు జరుగుతుందో, టీడీపీ ప్రభుత్వంలో పేదలు ఏవిధంగా ఆర్థికంగా ఇబ్బంది పడ్డారో వివరించారు. పేదల మరుగుదొడ్ల బిల్లులు స్వాహా చేసిన ఘనత ఎమ్మెల్యే స్వామిది అని ఇంతకన్నా ఉదాహరణ ఇంకేం కావాలని విమర్శించారు. ఎంపీటీసీ ఏ. కోటిరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నప్పరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సి.హెచ్ బ్రహ్మారెడ్డి, వేముల శ్రీనివాసరావు, ఇంటూరి రమణయ్య, వేముల రమేష్, కొల్లూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంజన సుతునికి ఘనంగా పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

సింగరాయకొండ: స్థానిక పాకల రైల్వే గేటు సమీపంలోని ఆంజనేయనగర్‌లో బుధవారం హనుమజ్జయంత్యుత్సవాల్లో భాగంగా ఆంజనేయ స్వామి మూలవిరాట్‌ను మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి తమలపాకులతో అభిషేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. రాత్రికి స్వామివారిని గారెలు, మామిడి పండ్లతో పూజించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాలు మరో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళాపోలీస్‌కు ఎస్పీ అభినందన


మహిళా పోలీస్ శ్రీదేవిని అభినందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

పామూరు: బాల్య వివాహాలపై సకాలంలో సమాచారం అందించి అడ్డుకున్న పామూరు రెండో సచివాలయం మహిళా పోలీస్ కె.శ్రీదేవిని ఎస్పీ మలికాగర్గ్ ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ పామూరు ఎస్టీకాలనీ, పంచాయతీ పరిధిలోని గోపాలపురం, పలుచోట్ల బాల్యవివాహాల సమాచారం అందడంతో ఎస్సై, స్వచ్ఛందసంస్థలు, ఐసీడీఎస్ వారితో కలిసి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి కార్యక్రమాన్ని నిలుపుదల చేయించామన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం


ఫాగింగ్ చేయిస్తున్న ఈఓఆర్డీ జగదీష్

టంగుటూరు: ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని ఈఓఆర్డీ నర్రా జగదీష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని శివపురం గ్రామంలో బుధవారం దోమలు నిర్మూలనకు ఫాగింగ్ చేశారు. సర్పంచ్‌తోపాటు పంచాయతీ కార్యదర్శి బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి హామీ పని


కూలీల హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

జరుగుమల్లి(సింగరాయకొండ): జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద పని కల్పిస్తామని ఎంపీడీఓ పి.రామకృష్ణ పేర్కొన్నారు. జరుగుమల్లి మండలం తూమాడు గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తకుంట వద్ద ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. మస్టర్ రిజిస్టరు తనిఖీ చేశారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ఉన్నారు.

వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓలు

ఉలవపాడు: మండలంలోని ఖాళీగా ఉన్న 7 గ్రామ వలంటీర్ల పోస్టులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ చెంచమ్మ, తహసీల్దార్ బ్రహ్మయ్య వచ్చిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ భీమవరం-2, చాగోళ్ల, చాకిచర్ల, కరేడు-1, కరేడు-2, రామాయపట్నం, ఉలవపాడు-2 గ్రామ సచివాలయాల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన వారికి వాలంటీర్ల పోస్టులు ఇస్తామన్నారు.

వైభవంగా గంగా భవానీ తిరునాళ్ల


విశిష్ట అలంకరణలో గంగాభవాని విగ్రహమూర్తి, బొల్లావులు


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యుత్‌ప్రభ

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద శ్రీగంగాభవాని వార్షిక తిరునాళ్ల నాల్గవరోజు వైభవంగా సాగుతోంది. ఈసందర్భంగా బుధవారం అమ్మవారికి, బొల్లావులకు ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మండలంలో మొట్టమొదటిసారిగా ఏర్పాటుచేసిన విద్యుత్‌ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా సాంస్కృతిక కార్యక్రమాలు, పాటకచ్చేరి అలరించాయి. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో 10 వేల మంది భక్తులకు మహాఅన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, సర్పంచ్ చప్పిడి వరలక్ష్మి, దేవస్థాన కమిటీ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కల్లూరి రామిరెడ్డి, పువ్వాడి రాంబాబు, యాదాల సాయికిరణ్, గట్లా విజయబాస్కర్‌రెడ్డి, అజయ్, గ్రామస్తులు, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కమిషనర్ డీవీఎస్ నారాయణరావు

కనిగిరి రూరల్: జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరిత గతిన పూర్తి చేయాలని కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం గృహ నిర్మాణ, సచివాలయ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మోడల్ స్కూల్ వద్ద గృహాలు నిర్మించని లబ్ధిదారులను గుర్తించి నోటీసులు ఇవ్వాలని రెవెన్యూ సెక్రటరీలను ఆదేశించారు. ఇంటి నిర్మాణం చేపట్టేందుకు సుముఖంగా లేని లబ్ధిదారులతో లిఖిత పూర్వకంగా పత్రాన్ని తీసుకోవాలన్నారు. వారి స్థానంలో ఇంటి నివేశన స్థలం లేని అర్హులను గుర్తించి వారికి పంపిణీ చేస్తామన్నారు. పట్టణంలో ఇంటి పన్నులు లేకుండా ఉన్న గృహాలను గుర్తించి 16ఏలో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామనాథం, మెప్మా టీఎంసీ రఘు పాల్గొన్నారు.

ఎండలకు జాగ్రత్తలు పాటించండి


కానిస్టేబుళ్లకి కళ్లద్దాలు, టోపీలు అందజేసిన డీఎస్పీ

కందుకూరు: పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల తీవ్రత దృష్ట్యా ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది కనీస జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ రామచంద్ర సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ కానిస్టేబుళ్లకి టోపీలు, కళ్లద్దాలు, గ్లూకోజ్ వాటర్ బాటిళ్లని అందజేశారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూనే ఆరోగ్యం పట్ల అప్రత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని, ఈ పరిస్థితుల్లో రోజంతా ఎండలో నిలబడి విధుల్లో ఉండే కానిస్టేబుళ్లు డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ఎండలను తట్టుకునేందుకు కనీస ప్రాథమిక అవసరాల కింద ఉపశమనం కోసం కళ్ల అద్దాలు, టోపీలు వంటివి అంజేసినట్లు తెలిపారు. సీఐ వెంకట్రావ్, ఎస్సై హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే భారీ జరిమానా


పాలేరులో అక్రమంగా ఇసుక తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

జరుగుమల్లి(సింగరాయకొండ): ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే భారీగా జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మైనింగ్, సెబ్ అధికారుల బృందం హెచ్చరించింది. బుధవారం జరుగుమల్లి మండలం పైడిపాడు పంచాయతీ పరిధిలో పాలేరు వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.సుధీర్‌బాబు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో పైడిపాడు ప్రాంతంలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. సెబ్ జెడీ టీమ్ సీఐ కె.వంశీధర్, మైనింగ్ శాఖ విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్‌బాబు, సెబ్ ఎస్సై సీహెచ్ దయాకర్, ఆర్ఐ రమణయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాలు సద్వినియోగం చేసుకోవాలి

● రైతులకు ఏడీఏ రమేష్ సూచన


మర్లపాడులో యంత్రాలను పరిశీలిస్తున్న ఏడీఏ రమేష్, ఏఓ స్వర్ణలత

టంగుటూరు: రైతు సంఘాల ద్వారా అందించిన ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ రమేష్ సూచించారు. మండలంలోని మర్లపాడు గ్రామ రైతు భరోసా కేంద్రానికి వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా అందించిన పరికరాలను ఆయన ఏఓ స్వర్ణలతతో కలిసి బుధవారం సందర్శించారు. ఏడీఏ మాట్లాడుతూ.. ఒక ట్రాక్టరు, రెండు వరి గడ్డి చుట్టే యంత్రాలు అందించామన్నారు. వీటి పూర్తి ధర రూ.14,82,577 కాగా అందులో ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.5,93,030 అందించిందని, మిగిలిన 50 శాతం పీడీసీసీ బ్యాంకు రుణంగా మంజూరు చేసిందని వివరించారు. యంత్ర పరికరాలను సభ్యుల అవసరాలకు వాడుకుంటూ ఆర్బీకే పరిధిలో ఉన్న రైతులకు తక్కువ అద్దెకు ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్రామంలో పని లేని ఎడల వేరే గ్రామానికి తీసుకుపోవాలంటే గ్రామ కమిటీ ఆమోదంతో తీర్మానం చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏ శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వేలంపాట ద్వారా రూ.25.71 లక్షల ఆదాయం

లింగసముద్రం: మండలంలోని మొగిలిచర్ల దత్తాత్రేయస్వామి వార్షిక వేలంపాటలు దేవాదాయశాఖ కావలి డివిజన్ పరిశీలకుడు సుధీర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వేలంపాటల్లో రూ.24.71 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. గత ఏడాది వేలంపాటల ద్వారా రూ.17.24 లక్షలు రాగా ఈ ఏడాది రూ.24.71 లక్షలు వచ్చినట్లు చెప్పారు. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం రూ.8.47 లక్షల ఆదాయం ఎక్కువగా వచ్చిందన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ చంద్రసేన్

గుడ్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓ చంద్రసేన్ బుధవారం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు పని ప్రదేశాలలకు ఉదయం 6 గంటలకు వచ్చి ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేసుకొని త్వరగా వెళ్లేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కూలీలకు ఇబ్బందులు కలగకుండా మంచినీటి వసతి, టెంట్‌లు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పని ప్రదేశాల వద్ద ఉంచాలన్నారు. కూలీలకు రోజుకు రూ.272 కూలి పడేలా పనులు చేయించాలన్నారు. అడిగిన వారందరికీ పనులు కల్పిస్తూ కూలీల సంఖ్య పెంచాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్‌లు ప్రతి రోజు పనులను పర్యవేక్షిస్తూ మస్టర్లను తనిఖీ చేయాలన్నారు. ఏపీఓ వినయ్, ఈసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతికి ఘన నివాళి


టంగుటూరులో కోటేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వీఆర్‌ఏల సంఘ నాయకులు

టంగుటూరు: టంగుటూరు 2వ సచివాలయ వీఆర్‌ఏ మద్దిరాల కోటేశ్వరరావు(70) వడదెబ్బకు మృతి చెందారు. ఆయన మృతదేహానికి మండల వీఆఏల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద నివాళులర్పించారు. ప్రభుత్వం నుంచి మట్టి ఖర్చుల కింద మంజూరైన నగదును వీఆర్‌ఏ కుటుంబ సభ్యులకు వీఆర్వో నరసింహం అందించారు. వీఆర్వో సింహాద్రి, కార్యదర్శి శ్రీనివాసరావు, వేణు, సుందరరావు, నారాయణ, మల్లెల కృష్ణ, రాము, శ్రావణి, సీఐటీయూ నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరులో చలివేంద్రం ప్రారంభం


పొన్నలూరులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై రాజారావు

పొన్నలూరు: మండల కేంద్రమైన పొన్నలూరులో గుడిపూడి కిరణ్ ఆధ్వర్యంలో బుధవారం మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని స్థానిక ఎస్సై దాసరి రాజారావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఎస్సై మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎండలు విపరీతంగా ఉన్నందున బాటసారులు, పాదచారుల సౌకర్యార్థం సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకుడు కిరణ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నూతలపాటి శివనారాయణ, చుండి నవీన్, జడ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు పొగాకు చూర బేళ్ల వేలం

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రంలో పొగాకు చూర బేళ్ల విక్రయానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న చూర బేళ్లను శుక్రవారం వేలం కేంద్రానికి చూర బేళ్ల తీసుకురావాలని సూచించారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

● కలెక్టర్ హరినారాయణన్


రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

వలేటివారిపాలెం: సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని సచివాలయాన్ని బుధవారం ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ రికార్డులు పరిశీలించారు. ఐడేవారిపాలెం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి వ్యవసాయాధికారిని ఈ సచివాలయ పరిధిలోని భూమి ఎంత ఉంది ఏ రకమైన పంటలు వేస్తారని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించాలని ఏఓను ఆదేశించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ వెంట కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, డీఎల్‌పీఓ పద్మజ, తహశీల్దార్ సుందరమ్మ, ఎంపీడీఓ రషీక్‌అహ్మద్, ఏపీఓ షమీర్‌బాషా, ఆర్ఐ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా పార్కు అభివృద్ధి పనులు


పార్కులో నిర్మాణ దశలో ఉన్న కిడ్స్‌జోన్


పార్కులు ఏర్పాటు చేసిన అందమైన గ్రీనరీ

కందుకూరు అర్బన్: పట్టణంలో పార్కుల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొన్నటి వరకు పట్టణంలో మున్సిపల్ పార్కు ఉన్నా సరైన వసతులు లేకపోవడంతో ప్రజలు అక్కడకు వెళ్లడానికి పెద్దగా ఆసక్తిచూపలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పట్టణంలోని పలు పార్కుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మున్సిపల్ పార్కు, ముత్యాలగుంట దగ్గర ఉన్న పార్కుల అభివృద్ధి పనులను ప్రారంభించగా, ముత్యాలగుంట పార్కు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సందర్శకుల కోసం పార్కును సర్వంగా సుందరంగా రూపుదిద్దుతున్నారు. సుమారు రూ.40 లక్షలతో పార్కులో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందులో రూ.23 లక్షలతో వాకింగ్ ట్రాక్, కిడ్స్‌జోన్, అక్కడక్కడ కూర్చోవడానికి అరుగులు, అందమైన చెట్లు, పచ్చదనం నిండి పోయేలా పూలమొక్కలను ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా రూ.17 లక్షలతో పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. చకచకా పనులను పూర్తి చేసి త్వరలో పార్కును ప్రారంభించేదుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



పర్యావరణహిత జీవనశైలిపై వివరిస్తున్న డీఆర్‌ఓ వెంకటసుబ్బయ్య

పామూరు: పర్యావరణ సమతుల్యత ద్వారా సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అటవీ శాఖ డీఆర్‌ఓ ఏ వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని వగ్గంపల్లె సమీపంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన పర్యావరణహిత జీవన శైలిగురించి వివరించి దాని ఆవశ్యకతను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలునాటి వాటిని సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటిని దుర్వినియోగం చేయకుండా పొదుపుగా వాడుకోవడం మొదలైన అంశాలపై వివరించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోకపోతే భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఎఫ్‌బీలు రోజారమణి, దొరసాని, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి సన్మానం


విద్యార్థిని ప్రియదర్శినిని సన్మానిస్తున్న బీసీ నాయకులు

కనిగిరి రూరల్: పది పరీక్షా ఫలితాల్లో 587 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని కంభం ప్రియదర్శినిని బుధవారం రాత్రి స్థానిక గార్లపేట రోడ్డులోని విజయహాస్పటల్ ప్రాంగణంలో బీసీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ జె.ప్రసాద్‌రావు, బీసీ సంక్షేమ సంఘ నాయకులు ఎస్‌కే నాయబ్ రసూల్, ఈర్ల విజయరామరాజు, నాయకులు నర్శింహులు, పల్లా మాలకొండయ్య, దేపూరి వెంకటేశ్వర్లు, కె. పెద్దన్న, ద్రోణాదుల చెంచులు, పచ్చవ చంద్రశేఖర్, పొట్టేలు మాలకొండయ్య, బాలమదార్, వెంకట్రావ్, తిరుపతిరావు పాల్గొన్నారు.

25న మండల సమావేశం

పీసీపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జున తెలిపారు. ఎంపీపీ అత్యాల జనన్య అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు. సమావేశానికి హాజరయ్యే అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

డాక్యుమెంట్‌లు పోయినవి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కందుకూరు టౌన్, డోర్‌నెం: 12-6-37 పెద్దబజారు, కోట వెంకట సుధాకర్‌రావు అను నాకు చిటుకుల గ్రామం, పటాన్ చెరువు మండలం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం నందు సర్వేనెం: 285 నందు 166.66 Sq yards గల రెండు ప్లాట్లు కలవు. వాటి డాక్యుమెంట్ నెంబర్లు 4445/2022, 4444/2022 గల రిజిష్టరు చేసుకున్న ఒరిజినల్ డాక్యుమెంట్‌లు కందుకూరు A.P.S.R.T.C డిపో నందు ప్రయాణించు సమయంలో పొరపాటున పోయినవి. ఆచూకీ తెలిసిన వారు పై అడ్రసుకు లేదా సెల్ 98483 82524 కు తెలియపరచగలరని మనవి. సమాచారం తెలిపిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును.

డాక్యుమెంట్ పోయినది

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, వలేటివారిపాలెం (మం.), పోకూరు గ్రామం, అత్తోట రమణయ్య అను నాకు చిటుకుల గ్రామం, పటాన్ చెరువు మండలం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం నందు సర్వేనెం: 284 & 285 నందు 166.66 Sq yards గల ప్లాటు కలదు. డాక్యుమెంట్ నెం: 8868/2022 గల రిజిష్టరు చేసుకున్న ఒరిజినల్ డాక్యుమెంట్ కందుకూరు A.P.S.R.T.C డిపో నందు ప్రయాణించు సమయంలో పొరపాటున పోయినది. ఆచూకీ తెలిసిన వారు పై అడ్రసుకు లేదా సెల్ 94927 16968 కు తెలియపరచగలరని మనవి. సమాచారం తెలిపిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును.